# సాక్షి
## శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 29 । ఆగస్టు । 2025




**టన్ను చీనీ రూ.15,500**

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీ కాయలు గరిష్టంగా రూ.15,500, కనిష్టంగా రూ.7 వేల ప్రకారం ధర పలికాయి.



**కిలో టమాట రూ.30**

కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.30, కనిష్టం రూ.24 ప్రకారం పలికింది. మార్కెట్‌కు 3,250 టన్నుల టమాటాలు వచ్చాయి.

**గరిష్టం/కనిష్టం 33.2°/20.6°**

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### వైద్య సిబ్బందిపై దాడి హేయం



ఉషశ్రీ చరణ్

**పెనుకొండ రూరల్:** కదిరిలో విధి నిర్వహణలో ఉన్న వైద్య సిబ్బందిపై టీడీపీకి చెందిన అల్లరిమూకలు దాడి చేయడం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ అన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో విచ్చలవిడి మద్యం విక్రయాల ద్వారా ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయన్నారు. బెల్టుషాపు వద్ద చోటు చేసుకున్న గొడవల ఫలితమే కదిరి ప్రభుత్వాస్పత్రిలో వైద్య సిబ్బందిపై దాడి అని పేర్కొన్నారు. మద్యం మత్తులో గొడవలకు దిగడంతో పాటు.. ఆస్పత్రిలో విధుల్లో ఉన్నవారిపై దాడిచేసి భయభ్రాంతులకు గురిచేయడం శాంతిభద్రతల వైఫల్యం కాదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

### జిల్లా అంతటా వర్షం



గంగంపల్లి వద్ద తడిచిన వేరుశనగను ఆరబోసిన రైతులు

**పుట్టపర్తి అర్బన్:** తుపాను ప్రభావంతో జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు 24 మండలాల్లో వర్షం కురిసింది. గోరంట్ల మండలంలో 36.2 మి.మీ, నల్లమాడ 28.4, కదిరి 14.2, హిందూపురం 14.2, రొళ్ల 11.4, ముదిగుబ్బ 10.6, గుడిబండ 9.2, మడకశిర 9, ఓడీచెరువు 8.4, అగళి 7.6, చిలమత్తూరు 7.2, కొత్తచెరువు 6.2, సోమందేపల్లి 6.2, అమరాపురం 4.8, పుట్టపర్తి 5.6, తలుపుల 5.4, అమడగూరు 5.2, తనకల్లు 4.2, లేపాక్షి 4.2, బుక్కపట్నం 4, నల్లచెరువు 3.2, పరిగి 3, గాండ్లపెంట 2.8, రామగిరి 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మరో మూడు రోజులు జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తొలగించిన పంటను భద్రపరుచుకోవాలని వారు సూచించారు.

### డిగ్రీ ప్రవేశాల రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

**ధర్మవరం అర్బన్:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ ప్రవేశాల రిజిస్ట్రేషన్ గడువును సెప్టెంబర్ 1 వరకు పొడిగించినట్లు ధర్మవరంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. డిగ్రీ మొదటి సంవత్సరం చేరదలచిన విద్యార్థులు గడువులోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రాసెసింగ్ ఫీజు కింద ఓసీలు రూ.400, బీసీలు రూ.300, ఎస్సీ, ఎస్టీలు రూ.200 చొప్పున చెల్లించాలన్నారు. ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కోర్సులు, కళాశాల ఎంపిక కోసం వెబ్ ఆప్షన్ నమోదు చేసుకోవడానికి రెండో తేదీ వరకు అవకాశం ఉందన్నారు. వెబ్ ఆప్షన్ మార్పు 3వ తేదీ, సీట్ల కేటాయింపు 6న జరుగుతాయన్నారు. 8వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. కళాశాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

### అర్ధరాత్రి దొంగల హల్‌చల్



అర్ధరాత్రి తాళం పగలగొట్టిన ఇల్లు

**పుట్టపర్తి టౌన్:** ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో బుధవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. సమాధి రోడ్డు మొదటి క్రాస్‌లో తాళం వేసి ఉన్న పలు ఇళ్లల్లో దొంగతనాలు చేయడానికి ప్రయత్నించారు. కట్టర్ సహాయంతో రెండు ఇళ్ల తాళాలు తెరిచి లోనికి ప్రవేశించినా విలువైనవేవీ లభించలేదు. దీంతో మరో రెండు ఇళ్ల తాళాలు తీయడానికి శతవిధాలా ప్రయత్నించి విఫలమయ్యారు. విసుగు చెందిన ఓ దొంగ ఓ ఇంటి ఆవరణలో ద్విచక్రవాహనాల్లో పెట్రోల్ తస్కరించడానికి ప్రయత్నిస్తుండగా సమీపంలోని ఇంటిలోని వృద్ధుడు గమనించి 'దొంగ.. దొంగ' అంటూ గట్టి కేకలు వేశాడు. దీంతో అప్రమత్తమైన దొంగ.. వృద్ధుడిని తోసేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఘటనలపై కాలనీవాసులు గురువారం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు నెలలుగా ఈ ప్రాంతంలో దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు నియంత్రించలేకపోతున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి.. రాత్రిపూట పోలీసు గస్తీ పెంచాలని కోరుతున్నారు.

---

కూదేరు మండలం కలగల్లకు చెందిన రాముడు అనే 65 ఏళ్ల వ్యక్తి అనారోగ్యంతో ఇటీవల అనంతపురం నగరంలో సంగమేష్ సర్కిల్‌లోని ఓ ఆస్పత్రికి వెళ్లాడు. ఇక్కడి డాక్టర్లు వారం రోజులు వైద్యం చేసి చేతులెత్తేశారు. దీంతో ఆయనను కుటుంబీకులు బెంగుళూరు తీసుకెళ్లారు. ఇప్పటికే అనంతపురంలోని ఆస్పత్రిలో రూ.65 వేల బిల్లయ్యింది. ఇప్పుడు బెంగుళూరులో ఎంత ఖర్చవుతోందోనని కుటుంబ సభ్యులు భయపడుతున్నారు.

బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన మురళి ఇటీవల ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు ఆయనను సాయినగర్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. నాలుగు రోజుల చికిత్సకు రూ. లక్ష ఖర్చయ్యింది. అయినా మురళి ఆరోగ్యంలో మార్పు లేదు. దీంతో మురళిని హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు ఆయన కుటుంబ సభ్యులకు సూచించారు. అక్కడి డాక్టరు పేరు, ఫోన్ నంబరును పేపరులో రాసి ఇవ్వడం గమనార్హం.



# రెఫరల్ దందా

- ఆస్పత్రుల మాయాజాలం
- జిల్లా వైద్యులతో మెట్రో సిటీల్లోని ఆస్పత్రుల నిర్వాహకుల సమావేశాలు
- పర్సెంటేజీలపై ఖరీదైన హోటళ్లలో మంతనాలు
- ఒక్కో సర్జరీకి 30 నుంచి 40 శాతం సొమ్ముతో ఎర
- రూ. లక్షల్లో నష్టపోతున్న రోగులు

**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేద రోగులను బెంగళూరు, హైదరాబాద్ తదితర మెట్రో సిటీల్లోని కార్పొరేటర్ ఆస్పత్రులు వెంటాడుతున్నాయి. ఎలాగైనా సరే రోగిని తమ ఆస్పత్రులకి రప్పించుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. జిల్లాకు చెందిన పలువురు డాక్టర్లతో 'రెఫరల్' దందా సాగిస్తున్నాయి. ఆరోగ్య శ్రీ పథకం పరిధిలో ఉన్న నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సరిగా వైద్యం చేయకపోవడం, ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతున్న రోగులను చివరి నిమిషంలో తాము ముందే మాట్లాడుకున్న వైద్యుడి దగ్గరకు పంపడం తాజాగా వెలుగు చూసింది.

**హైదరాబాద్ వైద్యుల క్యూ..**

రాష్ట్రంలోనే ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధి పరంగా వెనుకబడిందనే విషయం తెలిసిందే. ఈ విషయాన్నే హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రుల వారు ఆసరాగా మార్చుకున్నారు. అనంతపురంలో ఖరీదైన హోటల్‌గా చెప్పుకునే మాసినేని గ్రాండ్‌లో నెలలో కనీసం 10 నుంచి 13 సమావేశాలు హైదరాబాద్ కార్పొరేట్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని వైద్యులందరూ ఈ సమావేశాలకు హాజరవుతున్నారు. హైదరాబాద్‌ నుంచి అన్ని విభాగాల వైద్యులూ ఒకేసారి రావడం లేదు. ఆర్థోపెడిక్, కార్డియాలజీ, ఎండోక్రినాలజీ, గైనిక్ ఇలా ఒక్కొక్క విభాగం ఆధ్వర్యంలో ఒక్కోసారి మీటింగ్ పెడుతున్నారు. ఆ విభాగానికి చెందిన అనంతపురం జిల్లా వైద్యులందరినీ సమావేశానికి పిలిపిస్తున్నారు. 'రోగులను మా వద్దకు పంపించండి.. మీకెంత కావాలో అడగండి' అంటూ ఎర వేస్తున్నారు. ఇందుకు ప్రతిఫలంగా ఆ రోగికి ఆస్పత్రిలో అయ్యే బిల్లులో 30 నుంచి 40 శాతం సొమ్మును రెఫర్ చేసిన వైద్యుడికి ముట్టజెబుతున్నారు.

**కిడ్నీ, గుండె జబ్బుల రోగులు ఎక్కువ**

ఉమ్మడి జిల్లా నుంచి ఎక్కువగా కిడ్నీ, గుండె జబ్బులు, న్యూరో రోగులను హైదరాబాద్ పంపిస్తున్నట్లు తెలిసింది. హైదరాబాద్‌లో ఆరోగ్యశ్రీ పథకం వర్తించదు. దీంతో రోగికి ఐదారు లక్షలు బిల్లవుతుంది. ఇందులో 30 శాతం అంటే రూ.1.50 లక్షలు ఇక్కడి డాక్టర్‌కు అందుతుండడం గమనార్హం. ఇలా నెలకు వేల మంది పేషెంట్లు హైదరాబాద్, బెంగళూరు వెళుతున్నారు. తమ ఆస్పత్రిలోనే పిండుకున్నంత పిండుకోవడం.. చివరికి రోగి పరిస్థితి సీరియస్ అంటూ చేతులెత్తేసి హైదరాబాద్‌కు పంపించడం.. ఇదీ జిల్లాకు చెందిన కొందరు వైద్యుల తంతు. ఇలాంటి విష సంస్కృతి ఇటీవలి కాలంలో తీవ్రంగా పెరిగింది.

**ఆస్తులు అమ్ముకోవాల్సిందే..**

ఇటీవల జిల్లాలో ఏ ఆస్పత్రికెళ్లాలన్నా రోగులు భయపడుతున్నారు. రోగమేదో చెప్పరు.. ఎంత వుతుందో అసలే వెల్లడించకపోవడంతో భయకంపితులవుతున్నారు. టెస్టులతోనే వారం రోజులు గడిపి ఆ తర్వాత తమ చేత కాదంటూ చేతులెత్తేస్తూ హైదరాబాద్, బెంగుళూరులో ఫలానా డాక్టర్ల దగ్గరకు వెళ్లండని చెబుతున్నారు. అక్కడికెళ్లాక రోగి ఆస్తులమ్ముకునే వరకూ వదలడం లేదు.

**ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు ఇలా**

| కేటగిరీ | సంఖ్య |
|---|---|
| వ్యక్తిగత క్లినిక్‌లు | 65 |
| పాలీ క్లినిక్‌లు (గ్రూప్ ప్రాక్టీషనర్లు) | 06 |
| 20 పడకల లోపు నర్సింగ్‌హోంలు | 121 |
| 50 పడకల లోపు నర్సింగ్‌హోంలు | 32 |
| 100 పడకల లోపు ఆస్పత్రులు | 15 |
| 200 పడకల లోపు ఆస్పత్రులు | 04 |
| 200 పడకల పైన ఆస్పత్రులు | 02 |

### మెరుగైన వైద్య సేవలందించండి



బత్తలపల్లి పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం

**బత్తలపల్లి/ ధర్మవరం అర్బన్:** ఆరోగ్య కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించడంతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజా బేగం వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ తనిఖీ చేశారు. తొలుత ఆరోగ్య కేంద్రంలోని ఫార్మసీ గదిలోని మందుల వివరాలు, స్టాకు, ఓపీ రిజిస్టర్, ఆన్‌లైన్‌లో ఈహెచ్‌ఆర్ నమోదు, ల్యాబ్‌లో రక్తపరీక్షల వివరాలు పరిశీలించారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్‌తో ఆస్పత్రిలో జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాల వివరాలు, వాటి ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. పనితీరు బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు.

• ధర్మవరం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో జరుగుతున్న ఫేజ్–2 సబ్ డిస్ట్రిక్ లెవెల్ ఎన్‌సీడీ 4.0 శిక్షణ కార్యక్రమాన్ని గురువారం డీఎంహెచ్‌ఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రతి ఇంటికీ వెళ్లి 18 సంవత్సరాలు పైబడిన వారికి అన్ని పరీక్షలు ఉచితంగా నిర్వహించాలన్నారు. క్యాన్సర్ లక్షణాల గల వారిని తొలి దశలోనే గుర్తించి వారికి అవసరమైన మెరుగైన వైద్య సేవలను అందించే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్ర నాయక్, గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవి, దంత వైద్య నిపుణులు డాక్టర్ వివేక్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ పద్మమణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సాంబశివమ్మ, వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ కాల్‌లెటర్ల వెనుక కథలెన్నో..



సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు



ప్రక్రియను పరిశీలిస్తున్న పరిశీలకులు సుబ్బారావు

- డీఎస్సీ–25కి ఎంపికైన అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన
- 807 పోస్టులకు గాను తొలిరోజు 625 మంది అభ్యర్థులకు మెసేజ్‌లు
- తక్కువ ర్యాంకులు వచ్చిన వారిని పిలిచారంటూ మెరిట్ అభ్యర్థుల ఆవేదన
- తొలిరోజు పకడ్బందీగా సర్టిఫికెట్ల పరిశీలన

**అనంతపురం ఎడ్యుకేషన్:** డీఎస్సీ–25లో మెరిట్ సాధించిన చాలామంది అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలనకు మెసేజ్‌లు (కాల్ లెటర్లు) రాకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 807 వివిధ కేటగిరీ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. మెరిట్ సాధించి ఎంపికైన అభ్యర్థులకు గురువారం అనంతపురం రూరల్ మండలం ఆలమూరు రోడ్డులోని బాలాజీ పీజీ కళాశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభమైంది. ఎవరికైతే మెసేజ్ అందుతుందో వారు మాత్రమే సర్టిఫికెట్ల పరిశీలనకు రావాలంటూ చెప్పారు. అయితే చాలామంది మెరిట్ జాబితాలో మంచి ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు కూడా మెసేజ్‌లు రాకపోవడంతో గందరగోళానికి గురయ్యారు. మెసేజ్‌లు రాకపోయినా అక్కడికి చేరుకున్నారు. జిల్లా పరిశీలకులు, పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబును కలిసి విన్నవించారు. రాష్ట్ర కార్యాలయం నుంచి తొలిరోజు 625 మంది అభ్యర్థులకు సంబంధించిన సమాచారం మాత్రమే వచ్చిందని, తక్కిన వారికి శుక్రవారం సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని వారు స్పష్టం చేశారు. కాగా, సర్టిఫికెట్ల పరిశీలనకు డీఈఓ ఆధ్వర్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ప్రక్రియ రాత్రి 10.30 గంటలకు ముగిసింది. తొలిరోజు ఐదుగురు గైర్హాజరయ్యారు. వారికి సర్టిఫికెట్ల పరిశీలనకు శుక్రవారం కూడా అవకాశం ఇస్తున్నట్లు డీఈఓ తెలిపారు. శుక్రవారం సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది. రాత్రి 10 గంటల సమయానికి 132 మంది జాబితా జిల్లా విద్యాశాఖ అధికారులకు చేరింది. వారందరూ ఉదయం 9 గంటలకు హాజరుకానున్నారు.

**తక్కువ ర్యాంకులు వచ్చిన వారికి..**

తమకంటే తక్కువ ర్యాంకులు వచ్చిన వారికి కాల్‌లెటర్లు వచ్చాయని, తమకు రాలేదంటూ కొందరు అభ్యర్థులు వాపోయారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తే తమకు సంబంధం లేదంటూ చేతులెత్తేశారు. ఒకే సబ్జెక్టు ఒకే కేటగిరీలో తక్కువ ర్యాంకులు వచ్చిన వారికి కాల్‌లెటర్లు వచ్చినా ఎక్కువ ర్యాంకులు సాధించిన వారికి కాల్ లెటర్లు రాలేదు. అధికారులను అడిగితే తమకు సంబంధం లేదంటున్నారని, వెబ్‌సైట్‌లో ఉంచిన హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్లు చేసినా కనీస స్పందన లేదంటూ ఆయా అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పరిశీలకులు, స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ సుబ్బారావును కలిసి ఫిర్యాదు చేశారు. రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు.

## భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి



భూసేకరణ ప్రాజెక్టులపై సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

**ప్రశాంతి నిలయం:** జాతీయ రహదారుల విస్తరణ, సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం చేపట్టిన భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాతీయ రహదారుల విస్తరణకు భూసేకరణ, సోలార్‌పార్కుల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పుట్టపర్తి, ధర్మవరం ఆర్డీఓలు సువర్ణ, మహేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, ఎన్‌హెచ్ ప్రాజెక్టుల ప్రతినిధులు, ఫారెస్ట్, భూసేకరణ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

**పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించండి**

జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్‌హాలులో నిర్వహించిన జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహిక కమిటీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో యువతకు యూనిట్ల స్థాపనపై అవగాహన పెంపొందించాలన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా కొత్తగా పరిశ్రమల స్థాపనకు వచ్చిన అనుమతులను సమీక్షించారు. జిల్లా పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, జిల్లా ఫ్యాక్టరీల అధికారి రాధాకృష్ణ, ఏపీఐఐసీ, విద్యుత్, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పాల్గొన్నారు.

• కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో బిజినెస్ రీఫామ్ యాక్షన్ ప్లాన్- 2024పై సమావేశం జరిగింది. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమల ప్రోత్సాహకంలో భాగంగా సులభతర వాణిజ్యానికి సత్వర సేవలందిస్తున్నాయన్నారు.

## పారిశుధ్య పనుల్లో అవినీతిపై ఏసీబీ విచారణకు ఆదేశం

**చిలమత్తూరు:** హిందూపురం మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన పారిశుధ్య పనుల్లో చోటు చేసుకున్న అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి లోకాయుక్త ఆదేశాలు జారీ చేసింది. అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్ ప్రభాకర్ గతంలో చేసిన పనుల్లో అవకతవకలకు పాల్పడటంతో రూ.23 లక్షల రికవరీకి విచారణ అధికారులు ఆదేశించారు. ఆ సొమ్ము ఇంతవరకూ మున్సిపాలిటీకి చెల్లించలేదు. తాజాగా సదరు కాంట్రాక్టర్ టెండర్ కోట్ కన్నా ఎక్కువగా రూ.80 లక్షల మేర బిల్లులు పొందేందుకు ఎత్తుగడ వేశారు. అయితే ప్రీఆడిట్ అధికారులు కూడా అప్రూవ్ చేయకుండా వెనక్కు పంపారు. ఈ అంశాలపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. వీటి ఆధారంగా అనంతపురానికి చెందిన న్యాయవాది గోవిందరాజులు ఇటీవల లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. స్పందించిన లోకాయుక్త.. అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరంగా చర్యలు చేపట్టాలని ఏసీబీకి ఆదేశాలు జారీ చేసింది.

## • బహురూపాయ.. గణేశాయ



పుట్టపర్తిలో కొలువుదీరిన వినాయకుడు



హిందూపురంలోని భారీ గణపతి ప్రతిమ



పుట్టపర్తి మెయిన్‌రోడ్డులో గణేశుడు



ఎన్‌పీకుంటలో పూజలందుకున్న వినాయకుడు



ధర్మవరంలో ఎద్దులబండి నడుపుతున్న రైతు వినాయకుడు

**పుట్టపర్తి టౌన్:** వినాయక చవితి వేడుకలు అంబరం అంటాయి. పార్వతీ తనయుడి రాకతో జిల్లా ఆధ్యాత్మిక సాగరంలో మునిగింది. 'వక్రతుండ మహాకాయ..కోటి సూర్య సమప్రభ' అంటూ విఘ్నాలను తొలగించే వినాయకుని స్తుతితో మార్మోగింది. వాడవాడలా బహురూపాలలో ఏకదంతుడు కొలువుదీరాడు. పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, హిందూపురం తదితర ప్రాంతాల్లో కొలువుదీరిన బహురూపాల్లోని వినాయక ప్రతిమలను చూసేందుకు భక్తులు పోటెత్తుతున్నారు.

• పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలోనూ వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సత్యసాయి విద్యార్థులు సంగీత కచేరీ నిర్వహించారు. అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన గణేశ్ ఉత్సవాల్లో మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ రాజు పాల్గొన్నారు.



పుట్టపర్తిలో గణపతికి పూజ చేస్తున్న రత్నాకర్ రాజు

# ముందుకు సాగని పీ-4

- పేదల దత్తతకు ముందుకురాని మార్గదర్శకులు



పెదపల్లిలో గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి (ఫైల్)

**పుట్టపర్తి అర్బన్:** పేదలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పీ–4 కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అయితే క్షేత్రస్థాయిలో ఆశించిన మేరకు లక్ష్యం ముందుకు సాగడం లేదు. ఆర్థికంగా బాగున్న వ్యాపార వర్గాలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఎన్ఆర్ఐలు, నాయకులు (మార్గదర్శకులు) వారికి తోచిన విధంగా కొన్ని పేద కుటుంబాలను దత్తతకు తీసుకొని జీవన ప్రమాణాలు మెరుగుపరచి బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దాల్సి ఉంటుంది. 2029 వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో ఒక్కో మార్గదర్శకుడు కనీసం నాలుగు కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతి గ్రామంలోనూ సర్వే చేసి గ్రామ సభ నిర్వహించి బంగారు కుటుంబాలను గుర్తించాల్సి ఉంది. అయితే సర్వేలు, గ్రామ సభలు సరిగా చేపట్టకపోవడంతో కార్యక్రమం నీరుగారింది. అయితే ఇప్పటి వరకు జిల్లాలో 38,513 బంగారు కుటుంబాలు, 5,700 మంది మార్గదర్శకులను గుర్తించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. తక్కిన కుటుంబాలను త్వరలో గుర్తించి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని అంటున్నారు. ప్రతి వారం అధికారులతో కలెక్టర్ సమావేశాలు నిర్వహించి మార్గదర్శనం చేస్తున్నా... ఏ మండలంలో ఎంత మందిని, ఏ గ్రామంలో ఎవరిని గుర్తించారనే వివరాలను మాత్రం అధికారులు వెల్లడించలేకపోతున్నారు.

**ముందుకురాని ఉద్యోగులు..**

పీ–4 కార్యక్రమంలో భాగంగా పేదలను ఆదుకునేందుకు ఉద్యోగులు ఒక్కరూ ముందుకు రాలేదు. రాలేమంటూ కొందరు గంటాపథంగా చెప్తున్నారు. సర్వేలోనూ పాల్గొనబోమని కరాఖండిగా చెప్పారు. ఈ తరుణంలో సంబంధిత అధికారులు లక్ష్యాలను చేరుకోలేక తలలు పట్టుకుంటున్నారు.

## ఎరువుల అమ్మకాలు నిలిపివేత

**కొత్తచెరువు:** మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు డీసీటీవో సురేష్, మండల వ్యవసాయాధికారి సతీష్‌బాబుతో కలసి గురువారం తనిఖీ చేశారు. మూడు షాపుల్లో స్టాకు తేడా ఉండటంతో రూ.1,81,800 విలువ చేసే ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. కార్యక్రమంలో ఏఈఓ సునిత పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ద్విచక్ర వాహనానికి నిప్పు


కాలిపోయిన ద్విచక్ర వాహనం

**పెనుకొండ రూరల్:** మండలంలోని మరువపల్లికి చెందిన గొల్ల శ్రీనివాసులు ద్విచక్ర వాహనానికి దుండగులు నిప్పు పెట్టారు. మంగళవారం రాత్రి ఇంటి ఎదుట ఉంచిన వాహనానికి అర్ధరాత్రి సమయంలో నిప్పు పెట్టడంతో కాసేపటికి మంటలు ఎగిసి పడ్డాయి. అప్రమత్తమైన చుట్టుపక్కల వారు వెంటనే యజమానిని అప్రమత్తం చేసి, మంటలు ఆర్పారు. అప్పటికే ద్విచక్ర వాహనం కాలిపోయింది. వాహన యజమాని శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### పంచాయతీ పురోగతి సూచికపై నేడు శిక్షణ

**అనంతపురం సిటీ:** అనంతపురం జిల్లా పరిషత్ క్యాంపస్‌లోని డీపీఆర్‌సీ భవన్‌లో 'పంచాయతీరాజ్ పురోగతి సూచిక 1.0' అనే అంశంపై ఒక రోజు శిక్షణ తరగతులు శుక్రవారం నిర్వహించనున్నట్లు శిక్షణ కేంద్రం జిల్లా మేనేజర్ నిర్మల్ దాస్ గురువారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని జెడ్పీటీసీ సభ్యులు, ఐసీడీఎస్ అధికారులు, డీడీఓలు, డీఎల్‌పీఓలు, ఇంకా పలు శాఖల అధికారులు హాజరవుతారన్నారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ తరగతులు ప్రారంభిస్తారని వెల్లడించారు. సీఈఓ, డిప్యూటీ సీఈఓ కూడా పాల్గొంటారని వివరించారు.

### కొనసాగుతున్న విజిలెన్స్ తనిఖీలు


ఎరువు దుకాణాల్లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం

**అనంతపురం:** ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ ఎంఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు గురువారం కూడా కొనసాగాయి. డీఎస్పీ ఎం.నాగభూషణం, సీఐలు కే శ్రీనివాసులు తదితరులు ఆరు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. నిల్వల్లో తేడాలను గుర్తించి రూ.1.82 లక్షల విలువైన 6.85 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలను నిలిపి వేస్తూ నోటీసులు జారీ చేశారు.




శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ మూర్తులు


కదిరి కొండ

# సకల పాప హరణం..
# ఖాద్రీ గిరి ప్రదక్షిణం

- నేడు ఖాద్రీశుడి జన్మ నక్షత్రం
- ప్రతి నెలా స్వాతి నక్షత్రం నాడు గిరి ప్రదక్షిణకు పోటెత్తుతున్న భక్తులు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కదిరిలో లక్ష్మీనరసింహ స్వామి జన్మనక్షత్రం.. స్వాతి సందర్భంగా స్వామి పాదాలు వెలిసిన కదిరి కొండ చుట్టూ గిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తుతున్నారు. గిరి ప్రదక్షిణతో సకల పాపాలు తొలిగి పోతాయని, కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. దీంతో ప్రతి నెలా స్వాతి నక్షత్రం నాడు కదిరి గిరి ప్రదక్షిణకు భక్తజనం పోటెత్తుతోంది.

**కదిరి:** వసంత వల్లభుడు, నాలుగు గోపురాల నారసింహుడు, కోనేటి రాయుడు, ఖాద్రీశుడు, కాటమరాయుడు... ఇలా వివిధ రకాల నామాలతో కదిరిలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి.. కొలిచిన భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు. మహావిష్ణువు దశావతారాల్లో ఒకటైన నారసింహ స్వామి కదిరి ప్రాంతంలో పాదం మోపినందున ఖాద్రీ అనే పేరు వచ్చిందనేది చరిత్రకారుల నమ్మకం. 'ఖ' అంటే విష్ణుపాదం 'ద్రి' అంటే కొండ అని అర్థం. అందుకే కదిరికి ఖాద్రీ అన్న పేరు వచ్చింది. కాలక్రమేనా ఖాద్రీ కాస్తా కదిరిగా మారింది. ఇదే కాక 'ఖదిర' అనే చంద్ర వృక్షం నుంచి నారసింహుడు ఉద్భవించినందున ఈ క్షేత్రానికి ఖాద్రీ అనే పేరు వచ్చిందని కూడా మరో పురాణ గాథ ప్రచారంలో ఉంది.

**స్వయంభువుగా వెలసిన శ్రీవారు..**

దేశంలోని మిగిలిన నారసింహక్షేత్రాలకు భిన్నంగా కదిరిలో స్వయంభువుగా వెలసిన శ్రీవారు ప్రహ్లాద సమేతుడై గర్భాలయంలో భక్తులకు దివ్యమనోహరుడిగా దర్శనమిస్తారు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు శ్రీవారి గర్భాలయానికి ఎడమ భాగాన మరో ఆలయంలో కొలువుతీరి ఉన్నాయి. ప్రతి నెలా స్వాతి నక్షత్రం రోజు మాత్రమే ఇక్కడ మూల విరాట్‌కు అభిషేకం చేస్తారు. అభిషేకం తర్వాత శ్రీవారి మూలవిరాట్టు వక్షస్థలం నుంచి స్వేద బిందువులు ఉద్భవించడం కదిరి ఆలయ ప్రత్యేకత. హిరణ్యకశ్యపుడిని సంహరించేందుకు నరసింహ అవతారమెత్తిన మహావిష్ణువు... ఉగ్రరూపంలోనే సంచరిస్తుండడంతో ఆ రూపాన్ని ఉపసంహరించుకోవాలని ప్రహ్లాదుడు, దేవదేవతలతో పాటు శ్రీదేవి, భూదేవి కదిరి కొండపై నుంచి ప్రార్థించినట్లు బ్రహ్మాండ పురాణం చెబుతోంది. నృసింహుని మెప్పించేందుకు అక్కడి నుంచి వారంతా స్తోత్రం చేయడంతో స్వామి వారు అక్కడ దర్శనమిచ్చారని భక్తుల నమ్మకం. అందుకే ఆ పర్వతానికి 'స్తోత్రాద్రి' అనే పేరు కూడా ఉంది. ఆ సమయంలో స్వామి వారు అక్కడ మోపిన పాదాల గుర్తులు నేటికీ చెరిగిపోకుండా భక్తుల పూజలు అందుకుంటున్నాయి.


కొండపై స్వామివారి పాదముద్రికలు

**స్వాతి నక్షత్రం తేదీలు ఇవే..**

లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నాడు గిరి ప్రదక్షణ చేయడం ద్వారా మోక్షం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. దీంతో ఉమ్మడి జిల్లా నుంచే కాక పొరుగున ఉన్న కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కదిరికి వస్తుంటారు. కొండ చుట్టూ ఉదయాన్నే గిరి ప్రదక్షిణ మొదలు పెడతారు. స్వామి ఆలయం నుంచి కదిరి కొండకు 3 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అక్కడి నుంచి గిరి ప్రదక్షిణ చేయడానికి మరో మూడు కిలోమీటర్లు చుట్టి రావాల్సి ఉంటుంది. మొత్తంగా 6 కిలోమీటర్ల ప్రదక్షిణతో ఈ పుణ్యకార్యం ముగుస్తుంది. ఈ నెల 29న స్వాతి నక్షత్రం కావడంతో ముందు రోజే కదిరి ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 25. అక్టోబర్ 22, నవంబర్ 18, డిసెంబర్ 16తేదీల్లో స్వాతి నక్షత్రం రానుంది. గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తుల కోసం ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

**కదిరికి ఇలా చేరుకోవచ్చు..**

ఖాద్రీ క్షేత్రాన్ని చేరుకోవాలంటే అనంతపురం ఆర్టీసీ బస్టాండు నుంచి ప్రతి 10 నిమిషాలకు ఓ బస్సు ఉంది. 90 కి.మీ. ప్రయాణానికి 1.45 గంటల సమయం పడుతుంది. పుట్టపర్తి నుంచి కేవలం 40 కి.మీ దూరంలో ఉన్న కదిరికి బస్సులో గంటన్నర సమయం పడుతుంది. తిరుపతి నుంచి 186 కి.మీ ఉంది. బస్సులో 3.45 గంటల్లో చేరుకోవచ్చు. భక్తుల కోసం నరసింహస్వామి ఆలయ అద్దె గదులు అందుబాటులో ఉంటాయి. ఆలయంలో రోజూ ఉచిత భోజన వసతి ఉంటుంది.

**పరిసర ప్రాంతాల్లో చూడదగ్గ ప్రదేశాలు..**

కదిరి లక్ష్మీనారసింహుని దర్శించుకున్న అనంతరం కదిరి - రాయచోటి మార్గంలో కేవలం 12 కి.మీ దూరంలో గాండ్లపెంట మండలం కటారుపల్లిలో ఉన్న యోగి వేమన సమాధిని చూడవచ్చు. తర్వాత అదే మార్గంలో మరో 15 కి.మీ దూరంలో ఎన్‌పీ కుంట మండలం గూటిబైలులో ఉన్న ప్రపంచ ప్రసిద్ధి గాంచిన తిమ్మమ్మ మర్రిమాను సందర్శించవచ్చు. వీటిని సందర్శించి వచ్చేందుకు కదిరి ఆర్టీసీ బస్టాండు నుంచి బస్సు సౌకర్యం ఉంది.

**గిరి ప్రదక్షిణపై భక్తుల విశ్వాసం ఇలా..**

ఖాద్రీశుడి గిరి ప్రదక్షిణ చేయడం ద్వారా సకల పాపాలు తొలగిపోతాయని, కోరికలు నెరవేరుతాయని, మోక్షం లభిస్తుందని, ఆరోగ్యంతో పాటు మనశ్శాంతి దక్కుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. కొండపై ఉన్న ఔషధ మొక్కల గాలి తగలడం వల్ల ఆరోగ్యం, ఐశ్వర్యం, మనోవాంఛ సిద్ధిస్తాయని భక్తులు విశ్వసిస్తారు. అరుణాచలం, యాదగిరిగుట్ట, సింహాచలం, అన్నవరం వంటి పుణ్యక్షేత్రాలలో గిరి ప్రదక్షిణకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉన్నట్లుగానే కదిరి గిరి ప్రదక్షిణకూ ఉంది. దీంతో స్వాతి నక్షత్రం నాడు సుదూర ప్రాంతాల్లో ఉన్న శ్రీవారి క్షేత్రాలకు వెళ్లలేని వారు కదిరికి చేరుకుని గిరి ప్రదక్షిణతో తమ మొక్కులు తీర్చుకుంటున్నారు.

**ప్రతి నెలా గిరి ప్రదక్షిణ చేస్తున్నా**



ఖాద్రీశుడి గిరి ప్రదక్షిణతో సకల పాపాలు తొలిగిపోతాయని నమ్మకం. దీంతో ప్రతి నెలా స్వాతి నక్షత్రం నాడు ఎంతోమంది భక్తులు లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నుంచి కదిరి కొండ వరకు వెళ్లి అక్కడగిరి ప్రదక్షిణ చేస్తుంటారు. వీరిలో నేను కూడా ఒకణ్ని.

– జగన్నాథరెడ్డి, టీచర్, కదిరి

**భక్తుల సంఖ్య పెరుగుతోంది**



కదిరి కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ అనేది ఈ ఏడాది మార్చి నుంచి మొదలైంది. మొదట్లో తక్కువ మందితో ప్రారంభమై ఇప్పుడు వందల సంఖ్యకు చేరుకుంది. భక్తులకు ఉచిత ప్రసాదాలతో పాటు అల్పాహారం కూడా దాతలు అందజేస్తున్నారు. గిరి ప్రదక్షిణకు తగిన రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం.

– వి.శ్రీనివాసరెడ్డి, ఆలయ సహాయ కమిషనర్

## రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ యోగా పోటీలకు 'అనంత' ఆతిథ్యం


జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన వారిని సత్కరించిన దృశ్యం

**అనంతపురం కల్చరల్:** రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ యోగా పోటీలు ఈ ఏడాది నవంబర్‌లో జిల్లాలో నిర్వహించనున్నట్లు వివేకానంద యోగా కేంద్రం అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి తెలిపారు. ఇటీవల తాడేపల్లిలో జరిగిన యోగా పోటీల్లో జిల్లాకు చెందిన యోగాభ్యాసకులు మూడు స్వర్ణాలు, ఆరు రజతాలు, మూడు కాంస్య పతకాలు సాధించి, సెప్టెంబర్ 11న భిలాయ్‌లో, అదే నెలలో 27న విజయవాడలో జరిగే జాతీయ స్థాయిలో యోగా పోటీలకు అర్హత సాధించారు. ప్రతిభ చాటిన యోగాభ్యసకులను గురువారం అనంతపురంలోని షిరిడినగర్ వివేకానంద యోగ భవన్‌లో సత్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖరరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో యోగా గురువులు దివాకర్, పుల్లయ్య, మారుతీప్రసాద్, తారక్, నాని నవోమిన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణాలు బలిగొన్న అతి వేగం

- ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి వ్యక్తి మృతి

**ధర్మవరం అర్బన్:** అతి వేగం ఓ వ్యక్తి ప్రాణాలను బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని దుర్గానగర్‌కు చెందిన అక్కం సతీష్‌కుమార్(36), కవిత దంపతులు మగ్గం పనితో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. బుధవారం రాత్రి ఫోన్ కాల్ రావడంతో సతీష్‌కుమార్ ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లాడు. అదే సమయంలో ఆయన తమ్ముడు అనిల్‌కుమార్ ఇంటికి చేరుకుని అన్న లేకపోవడంతో ఫోన్ చేసి ఇంటికి వచ్చేటప్పుడు పెట్రోల్ తీసుకు రావాలని కోరాడు. దీంతో పనిముగించుకున్న అనంతరం సతీష్‌కుమార్ పెట్రోల్ తీసుకుని ఇంటికి వెళుతూ చికెన్ సెంటర్ వద్ద మలుపు వద్ద వేగాన్ని నియంత్రణ చేసుకోలేక అదుపు తప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడుని వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ధర్మవరం రెండో పట్టణ సీఐ రెడ్డప్ప తెలిపారు.

## ఒంటరితనం భరించలేక వివాహిత బలవన్మరణం


ప్రియాసాయి (ఫైల్)

**పరిగి:** ఒంటరి తనం భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. హిందూపురం పట్టణ ట్రాఫిక్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న సంపత్‌కుమార్‌కు భార్య లీలావతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పరిగి మండలం కొడిగెనహళ్లి పంచాయతీ పరిధిలోని సేవామందిరంలో నివాసముంటున్నారు. చిన్న కుమార్తె ప్రియాసాయి (26) కొన్నేళ్లుగా బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. కడప జిల్లా రాజంపేటకు చెందిన వ్యక్తితో మూడేళ్ల క్రితం వివాహమైంది. ఏడాది సజావుగా సాగిన కాపురం అనంతరం విభేదాల కారణంగా కోర్టు ద్వారా విడాకులు పొందారు. మూడేళ్ల క్రితం తల్లి లీలావతి మృతితో సేవామందిరంలో తండ్రి సంపత్‌కుమార్‌తో కలసి ఉంటోంది. వర్క్‌ఫ్రమ్ హోమ్ నిర్వహిస్తూ తండ్రికి ఆసరాగా ఉంటోంది. ఈ క్రమంలో ఒంటరితనంతో మానసిక వేదనకు లోనైన ఆమె బుధవారం రాత్రి యథావిధిగా తండ్రితో కలిసి భోంచేసిన అనంతరం తన గదిలోకి నిద్రించింది. గురువారం ఉదయం ఎంతసేపటికీ తలుపులు తీయకపోవడంతో తండ్రి వెళ్లి కిటికీ తెరిచి చూడగా ఉరికి విగతజీవిగా వేలాడుతూ కనిపించింది. సంపత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపారు.

## నిరసనల మధ్య గణనాథుడి నిమజ్జనం


నిమజ్జనానికి విగ్రహాన్ని తరలిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

**లేపాక్షి:** మండలంలోని కల్లూరు గ్రామంలో ప్రజల నిరసనల మధ్య వినాయక ప్రతిమల నిమజ్జన కార్యక్రమం సాగింది. వివరాలు.. వినాయక చవితి సందర్భంగా గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో గణనాథుడి ప్రతిమలను కొలువుదీర్చి వేడుకలు జరపాలని నిర్ణయించుకున్న స్థానికులు ఆ మేరకు అనుమతుల కోసం నాలుగు రోజులు క్రితమే పోలీసులను కలిసి మాట్లాడారు. మండలంలోని కల్లూరు, కోడిపల్లితో పాటు మరో రెండు గ్రామాలు అత్యంత సమస్యాత్మక జాబితాలో ఉండడంతో వినాయక మంటపాల ఏర్పాటు, నిమజ్జనం, డీజేలు, డ్రమ్స్‌లు ఉపయోగించరాదనే నిబంధనలను పోలీసులు వివరించారు. మంటపాలు ఏర్పాటు చేస్తే మరుసటి రోజే నిమజ్జనం చేయాలని సూచించారు. దీంతో బుధవారం రాత్రి వినాయక ప్రతిమలను కొలువుదీర్చి పూజలు చేశారు. గురువారం నిమజ్జనం చేయాలని, లేకుంటే బైండోవర్ చేస్తామంటూ పోలీసులు హెచ్చరించడంతో ప్రజలు నిరసన వ్యక్తం చేసారు. వినాయక మంటపాల వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఏడాదికి ఒకసారి భక్తి శ్రద్ధలతో చేసుకునే పండుగపై ఆంక్షలు సరికాదని నినదించారు. కేవలం టీడీపీ నేతల దౌర్జన్యాలతోనే ఈ దుస్థితి దాపురించిందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రతిమలను నిమజ్జనానికి తరలించారు.

## రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

- వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి


విలేకరులతో మాట్లాడుతున్న నరసింహమూర్తి

**మడకశిర:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, మడకశిర యువజన విభాగం అధ్యక్షుడు శేషాద్రి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నాగభూషణ్‌రెడ్డి, రంగనాథ్, రవికుమార్, అశ్వత్థనారాయణ విమర్శించారు. గురువారం వారు మడకశిరలో విలేకరులతో మాట్లాడారు. 5 రోజుల క్రితం మడకశిర మండలం ఎం.రంగాపురంలో ఓ బాలికపై జరిగిన అత్యాచారయత్నం ఘటనపై స్థానిక పోలీసులు వెంటనే స్పందించలేదన్నారు. బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదులోను, నిందితుడి అరెస్టులోనూ నిర్లక్ష్యం వహించారన్నారు. అధికార పార్టీ నాయకులు చెబితేనే పోలీసులు ఫిర్యాదులు తీసుకుంటారని, లేకపోతే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనేందుకు ఇదొక ఉదాహరణ మాత్రమేనన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పోలీసులు నిష్పాక్షపాతంగా వ్యవహరించకపోతే వ్యవస్థపై ప్రజలు నమ్మకం కోల్పోతారన్నారు. మడకశిర మండలంలో బాలికపై అత్యాచార ఘటనను నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు హనుమంతరాయప్ప ఖండించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.



## పీహెచ్‌సీ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత

**రొద్దం:** మండలంలోని పెద్దమంతూరు రొప్పాల వద్ద రూ.2కోట్లతో చేపట్టిన పీహెచ్‌సీ నిర్మాణానికి గురువారం మంత్రి సవిత భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,.. పీహెచ్‌సీ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత వాసులకు నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పెద్దమంతూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ బాలిక మృతి

**ధర్మవరం అర్బన్:** విద్యుత్‌షాక్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక బుధవారం సాయంత్రం మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. ప్రకాశం జిల్లా కనిగిరి మండలం పునుగోడు గ్రామానికి చెందిన పొట్లూరి శ్రీహరి, రేష్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. బతుకు తెరువు కోసం మూడు నెలల క్రితం ధర్మవరానికి వలస వచ్చి శారదానగర్‌లో నివాసముంటున్నారు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ ఏడాది జూలై 14న చంద్రబాబు నగర్‌లో మాయకుంట్ల జయచంద్రకు చెందిన ఇంటి నిర్మాణ పనుల్లో పాల్గొన్న సమయంలో పెద్ద కుమార్తె వెంకటేశ్వరి (10) కూడా తల్లిదండ్రులతోపాటు వెళ్లింది. ఆ సమయంలో పైభాగంలో 11 కేవీ విద్యుత్ లైన్ ప్రమాదవశాత్తు తగిలి షాక్‌కు గురైంది. వెంటనే బాలికను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం, తిరుపతి రుయా ఆసుపత్రిలో వైద్యం చేయించారు. ఈ నెల 24న గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం బాలిక మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## సెక్యూరిటీ గార్డు దుర్మరణం


మృతుడు మహబూబ్‌బాషా

**హిందూపురం:** స్థానిక జాతీయ రహదారిపై ఓ ప్రైవేట్ బస్సు ఢీకొన్న ఘటనలో సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. గురువారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. తూముకుంట పారిశ్రామిక వాడ నుంచి హిందూపురానికి వెళుతున్న సెక్యూరిటీ గార్డు మహబూబ్ బాషా (40)ను మిట్టమీదపల్లి గేట్ వద్ద బెంగళూరు నుంచి వెళుతున్న ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై హిందూపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఉత్సవాల్లో అల్లర్లకు తావివ్వొద్దు

- శాంతి కమిటీ సమావేశంలో ఎస్పీ రత్న


శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

**కదిరి టౌన్:** వచ్చే నెల 2న కదిరిలో జరిగే వినాయక నిమజ్జనం కార్యక్రమంలో ఎలాంటి అల్లర్లకు తావివ్వరాదని ఉత్సవ కమిటీల నిర్వాహకులు, మత పెద్దలకు ఎస్పీ రత్న సూచించారు. స్థానిక కోనేరు సమీపంలోని ఓ ప్రైవేట్ కల్యాణమంటపంలో గురువారం ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు నిమజ్జనానికి విగ్రహాలను ఊరేగించే మార్గంలో అక్బరియా మసీదు, ఈద్గా, అలంఖాన్ మసీదు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ముస్లిం మత పెద్దలతో మాట్లాడారు. సోదరభావంతో మెలగాలని సూచించారు. అనంతరం శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతూ.. నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో వ్యవహరించాలన్నారు. నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన నిబంధనలపై ఉత్సవ కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఊరేగింపు సమయంలో డ్రోన్ కెమెరాలతో భద్రతను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. చిన్న పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం రోజు ఉదయం 11 నుంచి రాత్రి 12 గంటల్లోపు పూర్తి చేయాలని సూచించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వి.వి.ఎస్.శర్మ, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐలు నారాయణరెడ్డి, నిరంజన్‌రెడ్డి, నాగేంద్ర, ట్రాన్స్‌కో ఏఈ, మున్సిపల్ సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## స్కూటరిస్టుకు తీవ్ర గాయాలు

**రాప్తాడు రూరల్:** బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు..అనంతపురం రూరల్ మండలం నందమూరినగర్‌కు చెందిన గోవిందప్ప కుమారుడు కృష్ణ బీటెక్ పూర్తి చేశాడు. బుధవారం అర్ధరాత్రి సమయంలో నందమూరినగర్ నుంచి పిల్లిగుండ్లకాలనీకి బైకుపై వెళుతుండగా నరిగిమ్మ ఆలయం దాటిన తర్వాత ఎదురుగా రాంగ్‌రూట్‌లో వచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో కృష్ణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే సర్వజనాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతిలోని స్విమ్స్‌కు వైద్యులు రెఫర్ చేశారు. ఘటనపై అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## హోరాహోరీగా ఎడ్లబండి పోటీలు


పోటీలను ఆసక్తిగా గమనిస్తున్న ప్రజలు

**పుట్టపర్తి:** బుక్కపట్నం మండలం జానకంపల్లికి చెందిన వినాయక కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎడ్ల బండి పోటీలు హోరాహోరీగా సాగాయి. 57 బండ్లు పోటీల్లో పాల్గొనగా పట్నం గ్రామానికి చెందిన మౌర్య సుల్తాన్ ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే కొత్తచెరువు చెందిన భరత్ ఎద్దులు ద్వితీయ, కర్ణాటక నాగేపల్లికి చెందిన దేవర ఎద్దులు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేత ఎద్దుల యజమానులను అభినందిస్తూ నిర్వాహకులు నగదు పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు బాబురెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.